ప్రజాశక్తి
శుక్రవారం 12 సెప్టెంబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు



ఎన్ఐటికి గురుకుల కళాశాల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకులోయ మండలంలోని గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన తాంగుల దుర్గబాబు ఎన్ఐటికి ఎంపికయ్యాడు. ఇటీవల విశాఖలోని నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో 924 ర్యాంకు సాధించగా జార్ఖండ్‌లోని బిలాస్పూర్ లో ఉన్న ఎన్ఐటీలో ఐటీ బ్రాంచ్‌లో సీటు వచ్చింది. కోచింగ్ లేకుండా మొదటిసారి ఎన్ఐటిలో సీటు రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ గొర్లె రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణారావు అధ్యాపక సిబ్బంది అప్పలరాజు, గణేశ్వరరావు, మల్లేశ్వరరావు, విజయకుమార్, రాధాకృష్ణ, కిన్నెర, మోహన్, పీడీ రమణరావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ గొర్లె రామకృష్ణ, అధ్యాపకుల ప్రోత్సవంతోనే తాను ఎన్ఐటి సీటు సాధించగలిగానని దుర్గబాబు పేర్కొన్నారు.



ఎంపికైన దుర్గబాబు

హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో..

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే తరిమికొడతాం

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి: హైడ్రో పవర్ ప్రోజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం ఆద్వర్యంలో ఆదివాసీ గిరిజన సంఘం అనంతగిరి మండలం వేంగడ పంచాయితీ బంజోడ గ్రామంలో గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడు లచ్చన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ, నవయుగ కంపెనీలకు జిల్లాలో అనంతగిరి మండలంలో పెదకోట, గుజ్జెలి, చిట్టంపాడు మజ్జివలస కేంద్రంగా వేంగడ, పైనంపాడు, వాలాసి పంచాయితీలను దారాదత్తం చేసి గిరిజనులను జల సమాధి చేయడానికి పూనుకుంటుందన్నారు. గిరిజనుల భూములు ఆక్రమణ చేస్తూ కొండలు, గుట్టలు వారి ఆధీనంలో తీసుకోవాడానికి నవయుగ కంపెనీ ఏజెంట్లు సరిహద్దు, హద్దులు దిమ్మలు వేసి గిరిజనులను భయభ్రాంతులకు గురి



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు



నినాదాలు చేస్తున్న నాయకులు, గిరిజనులు

చేస్తుందన్నారన్నారు. నవయుగ ఏజెంట్ ప్రభుత్వ అధికారులతో కలిసి గ్రామాల్లో ప్రవేశించి గిరిజనులతో వాగ్వివాదానికి దిగి బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ గౌరవ అమీత్ బర్ధార్ దృష్టికి తీసుకు వెళ్లి వివరించామన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, గుర్తు తెలియని వారు సంచరిస్తే ప్రజలు పోలీసులకు పిర్యాదు చేయాలన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలు ఎవరైనా సృష్టిస్తే పోలీసులకు పిర్యాదు చేయాలని. మొండిగా వ్యవహరిస్తే తరిమి కొట్టాలన్నారు. నవయుగ కంపెనీ ఏజెంట్లు గ్రామాల్లో తిరగక పోతే ఎటువంటి గొడవలు, భయాందోళనలు ఉండవని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని, 5 వ షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టాన్ని ఉల్లంఘించి పీసా చట్టాలను తుంగలో తొక్కాలని ప్రయత్నిస్తున్న ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పి.శ్రీరాములు, ఎమ్.గోవింద్, కె.వెంకటరావు, కె.చిన్నయ్య, పీసా కమిటీ సభ్యులు అప్పలనాయుడు, దుర్గా, దేముడు, రామన్న సి.హెచ్. రామూర్తి,రాము, కృష్ణ, అనీల్, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి స్ఫూర్తితో పోరాటాలు

ప్రజాశక్తి-అరకులోయ: అఖిలభారత సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఆదివాసి హక్కులు, చట్టాల అమలుకై, హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా, కాఫీ రైతులకు అండగా పోరాటాలు ఉదృతం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు. అరకువేలి మండలం దొరవలస గ్రామంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ముసిరి మల్లన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, కామ్రేడ్ సీతారాం ఏచూరి భారతదేశంలో జరిగిన అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. విద్యార్థి దశ నుండే ప్రజాసేవకు తన జీవితం అంకితం చేశారన్నారు. విద్యార్థి, కార్మిక ,కర్షక, దళిత, మహిళ, ఆదివాసీల పోరాటాలకు దారి చూపిన నాయకుడు సీతారాం ఏచూరి అని కొనియడారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుతో అనంతగిరి, అరకువేలి, హుకుంపేట మండలాల పరిధిలో 14 పంచాయితీలు 150 గ్రామాలు 50వేల మంది ఆదివాసులకు జల సమాధి అవుతారన్నారు. జీవో 51 రద్దు చేయాలని పోరాటాలు కొనసాగిస్తామని ఆయన అన్నారు. బెర్రీ బోరర్ కీటకం సోకి ఆదివాసి కాఫీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆదివాసి కాఫీ



ఏచూరి చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న బాలదేవ్, గిరిజనులు

రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బుజ్జిబాబు, సోమన్న, రాజు, సింహాద్రి, రాములు, అప్పన్న, రమేష్, రాములమ్మ, రాధ, ముత్యాలమ్మ పాల్గొన్నారు,

పీసా చట్టంపై అవగాహన కల్పించాలి

-కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ సంచాలకులు రమిత్ మౌర్య



మాట్లాడుతున్న రమిత్ మౌర్య

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన హక్కుల పరిరక్షణ కోసం ఏర్పడిన పీసా చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలని కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ సంచాలకులు రమిత్ మౌర్య తెలిపారు. గురువారం పాడేరు ఐటీడీఏ పరిధిలోని గొందూరు, తడిగిరి పంచాయతీలను సందర్శించారు. గ్రామస్థులు, పీసా కమిటీ సభ్యులు, మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశాలలో మాట్లాడుతూ, హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన గిరిజనులకు పీసా ప్రత్యేక చట్టం వరంగా మారిందన్నారు. గిరిజనుల సంస్కృతిక, సంప్రదాయాలకు అనుగుణంగా, వారి అభివృద్ధికి దోహదపడేలా కేంద్ర ప్రభుత్వం పీసా చట్టాన్ని రూపొందించిందన్నారు. స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేయడం, అధికార వికేంద్రీకరణ, వనరులపై నియంత్రణ, సంస్కృతి పరిరక్షణ, మత్తు పదార్థాల నియంత్రణ, భూమి అన్యాక్రాంతం కాకుండా నిరోధించడం వంటివి పీసా చట్టం పరిధిలోకి వస్తాయని తెలిపారు. తడిగిరి గ్రామంలో మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించి ఆదర్శ గ్రామంగా నిలిచినందుకు గ్రామస్థులను అభినందించారు. గిరిజన ప్రాంతాల్లో అర్థవంతమైన గ్రామ సభలు నిర్వహించి, ప్రజా పాలన సాగించాలని హితవు పలికారు. ఏజెన్సీలో సాగవుతున్న ఆర్గానిక్ ఉత్పత్తులను నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీ సౌకర్యం కల్పించాలని తడిగిరి గ్రామస్థులు కోరారు. డివిజనల్ పంచాయతీ అధికారి పి.యస్.కుమార్ అధ్యక్షతన జరిగిన ఆయా సమావేశాలలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి చంద్రశేఖర్, పాడేరు, హుకుంపేట యం.పి.డి.ఓలు తేజ రతన్, సన్యాసిరావు, గొందూరు సర్పంచ్ రాంబాబు, తడిగిరి సర్పంచ్ రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

చట్టాల అమలుకు వినతి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: విద్యా, ఆరోగ్య చట్టాలు అమలు చేయాలని గురువారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సిసిఆర్) ప్రతినిధులు డిఇఒ బ్రహ్మాజీరావుకు, డిఎంహెచ్ఒకు వినతి పత్రాలు అందజేశారు. విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు 25శాతం ఉచిత సీట్లు కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని, క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం 2010ను జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ప్రజా ప్రయోజనాల దిశగా, ప్రజల ప్రాథమిక హక్కుల అమలు లక్ష్యంతో విద్యా, ఆరోగ్య హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సిసిఆర్ ప్రతినిధులు వగ్గు శామ్యూల్, కామరాజు, అర్జున్, బుచ్చిబాబు, చిరంజీవి, శివ, కామేష్, మత్స్యరాజు, శ్రీను పాల్గొన్నారు.



డిఇఒకు వినతిపత్రాన్ని అందిస్తున్న సిసిఆర్ సభ్యులు



పూల కుండీని ఇస్తున్న ఎపిడి

కలెక్టర్‌ను కలిసిన ఎపిడి శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి-పాడేరు: సిబ్బంది సహకారంతో ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉపాధి హామీ శ్రామికుల సంక్షేమమే మొదటి ప్రాధాన్యంగా విధులు నిర్వహిస్తానని రంపచోడవరం డివిజన్ డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. గురువారం పాడేరులో కలెక్టర్ దినేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన డ్వామా ఏపీడీగా తూతిక శ్రీనివాస విశ్వనాథ్ భాధ్యతలు స్వీకరించారు. గత సంవత్సర కాలంగా మారేడుమిల్లి ఎంపీడీఓగా సేవలందిస్తూ మండలాన్ని రాష్ట్రస్థాయిలో ప్రగతి పథంలో నిలిపిన శ్రీనివాస విశ్వనాథ్ 2007 గ్రూప్-1లో ఎంపీడీఓగా ఉద్యోగానికి ఎంపికై ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలో ఎంపీడీఓగా వివిధ మండలాలలో సేవలు అందించారు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు జిల్లాలలో డీపీఓగా, ప్రకాశం, బాపట్ల జిల్లాలలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా విశేష సేవలు అందించి ప్రభుత్వం నుంచి పురస్కారం అందుకున్నారు.

ఎంత కష్టమొచ్చింది.?

- కొట్టుకుపోయిన కాజ్‌వేతో రాకపోకలకు ఇక్కట్లు
- ఎరువులు, ఇతర సరుకుల తరలింపునకు నానా అగచాట్లు
- రెండు నెలలైనా తాత్కాలిక రహదారి ఏర్పాటులో నిర్లక్ష్యం
- మన్యవాసుల కష్టాలను పట్టించుకోని నేతలు, అధికారులు



తలపై యూరియా బస్తాలతో వాగు దాటుతున్న మహిళలు, గిరిజన రైతులు

ప్రజాశక్తి-విఆర్.పురం: ప్రకృతి ప్రకోపించి వరద ఉధృతితో కాజ్‌వేను కొట్టుకుపోతే, రెండు నెలలైనా తాత్కాలిక రహదారి ఏర్పాటులో నేతలు, అధికారుల నిర్లక్ష్యంతో మన్యవాసులు రాకపోకలకు నానా ఇక్కట్లు పడుతున్నారు. కొట్టుకుపోయినా కాజ్‌వే శిథిలాలపై నుంచే విద్యార్థులు, మహిళలు, ఇతర ప్రజలంతా ప్రమాదభరితంగా రాకపోకలు సాగిస్తుంటే, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల బస్తాలు, ఇతర వ్యవసాయ పరికరాలను గిరి మహిళలు, రైతులు తలపైనా, భుజాలపైనా మోసుకుంటూ, ఉధృతంగా ప్రవహించే వాగునీటిలో దిగి దాటుతున్నారు. ఇక బైక్‌లు, ఇతరత్రా చిన్న వాహనాలను సైతం మోసుకెళ్లి వాగుదాటిస్తుండగా, ఆటోలు, అంతకంటే పెద్దవాహనాల రాకపోకలు దాదాపు రెండునెలలుగా నిలిచిపోయాయి. కొట్టుకుపోయిన కాజ్‌వేతో ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నవరం వాగు వద్ద అన్ని వర్గాల ప్రజలు పడుతున్న రాకపోకల కష్టాలు హృదయ విదారకంగా, దయనీయంగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఏమాత్రం అదుపుతప్పినా, అప్రమత్తంగా లేకపోయినా, ప్రాణప్రమాదమే అన్న పరిస్థితుల్లోప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా తాత్కాలిక రహదారి ఏర్పాటు చేసి, అన్నవరం వాగుపై రాకపోకల కష్టాలకు విముక్తి కల్పించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

భారీ వర్షాలు, వరద ఉధృతికి అన్నవరం వాగు వద్ద కాజ్‌వే ండు నెలల క్రితం పూర్తిగా కొట్టుకుపోయింది. ఇదే మార్గంలో నిత్యం వందలాది మంది విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, ఇతర అన్ని వర్గాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇపుడు వారు పడే అవస్థలు చెప్పనలవి కాదు. విద్యార్థులు,



కూలిన కాజ్‌వే పైనుంచి రాకపోకలక విద్యార్థుల ఇక్కట్లు

మహిళలు, వృద్ధులు, ఇతర సాదారణ ప్రయాణికులు కాజ్‌వే శిథిలాల పైనుంచి దిగి వాగుదాటుతుండగా, ఎరువులు, ఇతరత్రా బరువులతో రైతులు, మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తలపైనా, భుజాలపై బరువైన బస్తాలను పెట్టుకుని, వాగునీటిలో దిగి కాలినడకన దాటక తప్పని పరిస్థితి. ఇక బైక్‌లు వాగు దాటించేందుకు రూ.50 ముట్టజెప్పాల్సిందే, రానుపోను ప్రతిరోజూ రూ.వంద బైక్ దాటించడానికి అవుతోందని యజమానులు వాపోతున్నారు.

ప్రమాదభరిత పరిస్థితుల్లో ఇక్కడ ప్రజలు వాగుదాటుతున్నా అధికారులు, నేతలకు చీమకుట్టినట్టయినా లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. నడుములోతు నీటిలో వాగును దాటించే క్రమంలో బైక్‌లుగానీ, ఎరువులు, ఇతర సరుకులుగానీ పడిపోతే ఇక అంతే సంగతులు, అంతేకాక వాగు ఉధృతిలో కొట్టుకుపోతే ప్రాణాలకు ప్రమాదం. కాజ్‌వే శిథిలాల పైనుంచి దాటే క్రమంలో పడిపోయినా ఆసుపత్రి పాలు కావాల్సిందే.

కాజ్‌వే కూలిపోయినప్పుడు పరిశీలన పేరుతో వచ్చి హడావిడి చేసిన నేతలు, ఆ తర్వాత రెండు నెలలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పత్తా లేకుండా పోయారని విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వయంత్రాంగం స్పందించి, తక్షణ రాకపోకలకు తాత్కాలిక మార్గం ఏర్పాటుతోపాటు ఇక్కడ గతంలో కూలిపోయిన హైలెవెల్ వంతెన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని మన్యవాసులు కోరుతున్నారు.

15 నుంచి యుటిఎఫ్ 'రణభేరి'



మారేడుమిల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 15 నుంచి 19 వరకు నిర్వహించే యుటిఎఫ్ రణభేరి జాతా పోస్టర్లను గురువారం రాజవొమ్మంగి ఎంఆర్‌సి కార్యాలయం వద్ద యూనియన్ మండల నేతలు ఆవిష్కరించారు..ఈ సందర్భంగా యుటిఎఫ్ నేత కె శ్రీను తదితరులు మాట్లాడుతూ.యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా కమిటీ ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పు అలాగే పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో ఈనెల 15 నుండి 19 వరకు ఐదు రోజులపాటు రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 16న రాజవొమ్మంగి మండలం నుండి దేవీపట్నం వరకు బైక్ జాతాను నిర్వహిస్తున్నామని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం రమేష్ బాబు మాట్లాడుతూ, పాఠశాలల్లో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని,.ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు ల్పించాలని,12వ పిఆర్‌సి కమిషన్ వెంటనే నియమించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల సహాధ్యక్షులు గొలగాని శ్రీను, మహిళా సహాధ్యక్షురాలు కోడూరి లోవరాజు, మహిళా కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, జిల్లా కౌన్సిలర్ పి రమణ, పత్రికా కార్యదర్శి టివిఎల్ ఎన్ మూర్తి, జి జిల్లా పత్రిక కార్యదర్శి టి బోజ్జీయ, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.వెంకటలక్ష్మి, కార్యదర్శి పులి రామకృష్ణ, నీలాద్రి రాజబాబు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: విద్యారంగ సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ రణభేరి జాతా కరపత్రాలను గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ మండల కార్యదర్శి కృష్ణారెడ్డి, అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ రణభేరి ఆందోళన చేపడుతోందన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఈశ్వరి దేవి, ఉపాధ్యాయులు గణేష్ కుమార్, నీలయ్య, ధర్మారెడ్డి నీలవేణి కృష్ణ, కోటి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

- అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు మహాసభలో సిఐటియు నేతలు
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతన అమలుకు డిమాండ్

ప్రజాశక్తి -చింతూరు: కనీస వేతనం రూ.26వేలు చెల్లింపు, సమ్మె ఒప్పందాల అమలుతోపాటు అన్ని సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు నేతలు పిలుపునిచ్చారు. గురువారం అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో చింతూరు ప్రాజెక్టు మహాసభ జరిగింది ప్రాజెక్ట్ కార్యదర్శి నూకరత్నం సిఐటియు జెండాను ఆవిష్కరించారు. సవనం వెంకటరమణ, నూక రత్నం అధ్యక్షవర్గంగా నిర్వహించిన మహాసభలో సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి. వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. . గతంలో 42 రోజుల సమ్మెలోకొన్ని హక్కుల్ని సాధించుకున్నా, మిగతా సమస్యలు అలాగే ఉండిపోయాయని, వాటినీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు అమలు, ఖాళీ సూపర్వైజర్ పోస్టుల భర్తీ, మినీ సెంటర్లు మెయిన్ కేంద్రాలుగా మారుస్తూ ఇచ్చిన జిఒ అమలు, పని గంటలు పెంచుతూ జారీ చేసిన జిఒలు రద్దు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకట్

అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బి నిర్మల మాట్లాడుతూ అంగన్వాడీలకు నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలని, అన్ని రకాల యాప్‌లు కాకుండా అన్నింటినీ ఒకే యాప్‌లో నిర్వహించేలా పనిభారాన్ని తగ్గించాలని కోరారు. మహా సభలో అంగన్వాడి యూనియన్ అధ్యక్షురాలు రాజేశ్వరి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, సెక్టార్ నాయకులు నాగమణి, చిట్టమ్మ, భద్రమ్మ, సరిత, దుర్గ, పార్వతి, అంగన్వాడీ కార్మికులు. సావిత్రి, కిట్టమ్మ. శేషమ్మ, రాములమ్మ, దుర్గ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత

ముంపు బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-కూనవరం: పోలవరం ముంపు బాధిత గిరిజన రైతులకు సబ్సిడీతో విత్తనాలు, వ్యవసాయ పరికరాలు ప్రభుత్వం ఇవ్వాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం .మండలంలోని మార్త శ్రీరామ్మూర్తి భవన్ లో పాయం సీతా రామయ్య అధ్యక్షతన అత్యవసర సమావేశంలో మండల కమిటీ సభ్యులు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం ముంపు బాధిత గిరిజన రైతులకు సాగునీటి పరికరాలు పైపులు, ఇంజన్లు, మోటార్లు ప్రభుత్వం 90శాతం సబ్సిడీ ద్వారా ఇవ్వాలని కోరారు. గిరిజన రైతులకు ముంపు లేని భూములకు సోలార్ మోటార్లు మంజూరు చేయాలని డిమాండ్ చేసారు. దిగువ ప్రాంత రైతులతో సమానంగా ముంపు ప్రాంత గిరిజన రైతులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు సబ్సిడీతో వ్యవసాయానికి అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, జిల్లా కమిటీ సభ్యురాలు మడకం నాగమణి,తాలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

రాజ్మా విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: ప్రభుత్వం సబ్సిడీతో గిరి రైతులకు పంపిణీ చేస్తున్న రాజ్మా విత్తనాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కండ్రం పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కె పాంగి చెప్పారు. ఆ పంచాయతీ కేంద్రంలో గురువారం రైతులకు ఆయన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,విత్తనాలను బయటి మార్కెట్లకు విక్రయించుకోకుండా సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, పంచాయతీ కార్యదర్శి లెక్కల వాణి, వార్డు సభ్యులు బాలుమెత్తి, బలరాం, శోభన్, కృష్ణ, పిసా ఉపాధ్యక్షులు పట్నాయక్, గిరి రైతులు పాల్గొన్నారు.

నేడు వైద్య పరీక్షల శిబిరం

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో ఈనెల 12వ తేదీ శుక్రవారం వైద్య పరీక్షల శిబిరం నిర్వహించనున్నారు. ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ ప్రారంభించనున్నారు. ఈనెల 12న ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఆరోగ్య పరీక్ష శిబిరం నిర్వహించనున్నామని, ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.


ఎన్నికైన మహిళా సంఘం నూతన సభ్యులు

ఆదివాసీ మహిళా సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ హైమావతి ఆధ్వర్యంలో గురువారం మహిళా సంఘం నూతన మండల కమిటీ ఎన్నికైంది. ఈ ఎన్నికలో మహిళా సంఘం మండల అధ్యక్షురాలుగా పాంగి సునీత, కార్యదర్శిగా కెమిలతి, కోశాధికారిగా ఈశ్వరమ్మతో పాటు మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి హైమావతి మాట్లాడుతూ, గిరి మహిళలకు, బాలికలకు, విద్యార్థినిలకు ఎటువంటి సమస్యలు తలెత్తినా వాటిని ముందుండి పరిష్కరించేందుకు మహిళా సంఘం పని చేస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులు మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమె కోరారు.

వికలాంగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలంలో వికలాంగుల రీవెరిఫికేషన్ సమస్యలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని, కొంతమందికి నోటీసులు జారీ చేయడం, మరికొందరికి అర్హత శాతం తగ్గించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, 2010లో జారీచేసిన సర్టిఫికెట్లనే కొనసాగించాలని డిమాండ్‌చేస్తూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు కొత్తలంక దేముడు ఆధ్వర్యాన ఎంపిడిఒకు గురువారం వినతిపత్రం అందించారు.

హోం స్టేల ఏర్పాటుకు చర్యలు

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:ప్రస్తుత పర్యాటక సీజన్లో గిరిజన హోం స్టేలు ఏర్పాటు చేయడానికి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలలో మేడ్ ఇన్ అరకు ఉత్పత్తులు విక్రయించడానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఎంపిడిఓలు, తహశీల్దారులు పర్యాటక శాఖ అధికారులతో హోం స్టేల ఏర్పాటు పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటకులు గిరిజన గ్రామాల్లో రాత్రి మకాం చేయడానికి అనువుగా ఉండే విధంగా హోం స్టేలను అభివృద్ధి చేయాలన్నారు అరకువ్యాలీ, లంబసింగి, మారేడు మిల్లి పర్యాటక ప్రాంతాలలో హోం స్టేలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంపిడిఓలు గుర్తించిన గ్రామాలను సందర్శించి లబ్దిదారులకు పర్యాటక ఆతిధ్యంపై శిక్షణ అందిస్తామన్నారు. అరకు వ్యాలీ మండలంలో 91 హోం స్టేలు, చింతపల్లి మండలంలో 30 హోం స్టేలు గుర్తించారని చెప్పారు. హోం స్టేలు పర్యాటకులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారిలో రంపచోడవరం నుండి ఉత్పత్తులు విక్రయించడానికి భూమిని గుర్తించాలని అధికారులకు సూచించారు. టూరిజం కమిటి మీటింగ్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటక రంగం పై అవగాహన కల్పించడానికి సైన్ బోర్డు లు ఏర్పాటు చేయడానికి అనంతగిరి వరకు గిరిజన ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. చిలి ఉత్సవాలకు ముందుగానే అరకు ఆర్ట్ ఫారంలు తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, పాడేరు ఐటిడిఏ పిఓ తిరుమణి శ్రీ పూజ, క్యూరేటర్ శంకరరావు, 22 మండలాల ఎంపిడిఓలు, తహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

మన్యంలో భారీ వర్షం


పొంగి ప్రవహిస్తున్న గింజర్తి వాగు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో గురువారం మధ్యాహ్నం భారీ వాన కురిసింది. 12:30 వరకు కాస్త ఎండ కాసినప్పటికీ, ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షం పడడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. పట్టణంలో వీధులన్నీ తడిసి ముద్దయ్యాయి. గంట పాటు కురిసిన వర్షానికి వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. పాడేరు పట్టణంలో డ్రైనేజీల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో పలుచోట్ల డ్రైనేజీల మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

డుంబ్రిగుడ: మండలంలో గురువారం సాయంత్రం పిడుగు శబ్దాలతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఉండగా సాయంత్రం మోస్తరు వర్షం కురవడంతో కొంత వాతావరణం చల్లబడింది. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు తిరుగు ప్రయాణంలో పలు ఇబ్బందులు పడ్డారు.

రాజవొమ్మంగి: మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండకాచి సాయంత్రం ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకొని ఈదురుగాలతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి మండలంలోని రాజవొమ్మంగి గ్రామ శివారు వట్టిగడ్డ వాగు, గింజర్తి, నెల్లిమెట్ల వాగులు పొంగి ప్రవహించడంతో అటుగా వెళ్లే వాహనాలు, ఇతర రాకపోకలు గంటల తరబడి నిలిచిపోయాయి. వాగు అవతలకు వెళ్లే వాహనదారులు, ఉద్యోగులు ,రైతులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.గురువారం కురిసిన వర్షం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు అంటున్నారు.

డిగ్రీ కళాశాలలో మాక్ పార్లమెంట్

ప్రజాశక్తి-చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో గురువారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి సూచన మేరకు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస పాత్రుడు అధ్యక్షతన జరగిన ఈ మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులు స్పీకర్, ప్రధానమంత్రి, నాయకులు, మంత్రులుగా వ్యవహరిస్తూ పార్లమెంటరీ విధానాలను ప్రదర్శించారు. ప్రజాస్వామ్యంలో పార్లమెంటు సమావేశాలు ఎలా జరుగుతాయో ప్రత్యక్ష అనుభవం కలిగించేలా కార్యక్రమం సాగింది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాస పాత్రుడు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే రాజ్యాంగం, ప్రజాస్వామ్య విధానాలపై అవగాహన అవసరమన్నారు. రాజకీయ శాస్త్ర ఉపాధ్యాయుడు జి.జగదీశ్‌బాబు మాక్ పార్లమెంట్ ముఖ్యాంశాలను వివరిస్తూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వి.రమణ, లీలా పావని, ఐ.రవీంద్ర నాయక్, జగత్‌రాయ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.



మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న అధ్యాకులు

‘డొంకరాయి’ నీటి విడుదల నిలుపుదల

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి దిగువ సీలేరు డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా నీటి విడుదలను గురువారం ఉదయం నుంచి నిలిపివేసామని ఎపి జెన్‌కో అధికారులు వెల్లడించారు. ఇటీవల అల్పపీడన ద్రోణి కారణంగా డొంకరాయి పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసాయి. వాగులు వంకలు నుంచి వచ్చిన నీరు జలాశయంలో చేరడంతో నీటిమట్టలు పూర్తిస్థాయికి పెరిగాయి. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా, ఈనెల 5వ తేదీ నాటికి 1035.60 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. పూర్తి స్థాయికి నీటిమట్టం చేరుకుంటే ప్రమాదమని భావించిన జెన్‌కో అధికారులు ఈ నెల 5న రాత్రి జలాశయం ఒకటో నెంబర్ గేటు నుంచి మూడు వేల క్యూసెక్కుల నీటిని దిగు ప్రాంతానికి విడుదల చేశారు. 1034 అడుగుల వద్ద స్థిరంగా జలాశయం నీటి నిలువలు కొనసాగేలా చర్యలు చేపట్టారు. నాలుగు రోజుల నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గురువారం ఉదయం నాటికి జలాశయంలో 1033.90 అడుగులకు నీటిమట్టం చేరడంతో నీటి విడుదల నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈనెల ఐదు నుంచి గురువారం ఉదయం వరకు 759 టిఎంసిల నీటిని దిగు ప్రాంతాన్ని విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుదుత్పత్తి నిమిత్తం 3519 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయంలో ఆంధ్ర వాటాగా గురువారం నాటికి 45.9236 టిఎంసిలు, సీలేరు, డొంకరాయి జలాశయాల్లో 12.9701 టిఎంసిలతో కలుపుకొని మొత్తం 58.8937 టిఎంసిలు నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. సీలేరు కాంప్లెక్స్‌లో గ్రిడ్ ఆదేశాల మేరకు జల విద్యుత్ కేంద్రాల్లో 3.7038 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.


డొంకరాయి రిజర్వాయర్ నుంచి నిలిపేసిన నీరు

జ్వరాల నివారణలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి- విఆర్ పురం: ఏజెన్సీలో విషజ్వరాలు విజృంభించి ప్రజలు అల్లాడిపోతున్నా అధికారులు స్పందించడం లేదని సిపిఎం నేతలు మండిపడ్డారు. గురువారం పిఎస్‌సి సెంటర్‌లో కొండ నాగమణి అధ్యక్షతన కూనవరం సిపిఎం పట్టణ కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు తాళ్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, బుధవారం కూనవరం గ్రామానికి చెందిన మునిగల వరలక్ష్మి డెంగీ జ్వరంతో మరణించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు, వరదలతో దోమలు విజృంభించి, వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. మరణాలు సంభవించే వరకు జ్వరాలపై నిర్లక్ష్యం తగదన్నారు. జ్వరాలపై ఇంటింటా సర్వేచేసి వైద్యసేవలు అందించడంతోపాటు దోమతెరలను పంపిణీ చేయాలని కోరారు. కూనవరం పాఠశాలకు వెళ్లే మార్గంలో సిమెంటు రోడ్డు పై మురుగు సమస్యకు శాశ్వతపరిష్కారం చూపాలని కోరారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి కొండ ఈశ్వర్లు, తెలగని నాగరాజు, నోముల సత్యనారాయణ, గడ్డిపాటి షణ్ముఖరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నేత శ్రీనివాసరావు

అటవీ అమర వీరులకు ఘననివాళి



చింతూరులోసంస్మరణ ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ ఉద్యోగులు


ప్రజాశక్తి -చింతపల్లి : చింతపల్లి డివిజనల్ అటవీ శాఖ కార్యాలయంలో డిఎఫ్ఒ వైవి.నరసింహారావు ఆధ్వర్యంలో అటవీ అమరవీరుల ఘననివాళులర్పించారు. కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, పుష్పగుచ్ఛాలు అర్పించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ అమరుల స్ఫూర్తితో అడవుల రక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 1939 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 23 మంది అటవీ సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కార్యక్రమంలో చింతపల్లి ఇన్‌ఛార్జ్ రేంజ్ ఆఫీసర్ ఎస్.వెంకట్రావు, లోతుగడ్డ రేంజ్ ఆఫీసర్ ప్రశాంతి, మర్రిపాకలు రేంజ్ ఆఫీసర్ సింహాచలం పడాల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కార్యాలయం నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అమరవీరులకు జోహార్లు అర్పించారు.

చింతూరు : జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక అటవీశాఖ డివిజన్ కార్యాలయంలో అమరులైన అటవీ ఉద్యోగులకు ఘనంగా నివాళులర్పించారు. డివిజన్ కార్యాలయ ఎఇఒ జిపి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చింతూరులో ర్యాలీ నిర్వహించారు చింతూరు డివిజన్, రేంజ్ కార్యాలయాల సిబ్బంది ఎపిజెఎఫ్ఎన్ఒ నేతలు పాల్గొన్నారు.

నేడు ‘చలో గొంటివానిపాలెం’

భారీగా తరలిరావాలని ఆదివాసీ జెఎసి నేతల పిలుపు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి:ఏలేశ్వరం నుండి గొంటివానిపాలెం, జె అడ్డతీగల వరకు రహదారి నిర్మాణ సమస్య పరిష్కారానికి ఈనెల 12న చలో గొంటివానిపాలెం ఆందోళనకు ఏజెన్సీ వాసులు కదలి రావాలని ఆదివాసీ జెఎసి జిల్లా నాయకులు వంతు బాలకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం రాజవొమ్మంగిలో జెఎసి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, రహదారి సమస్య పరిష్కారానికి ఆందోళనలో భాగంగా రాస్తారోకో, వంటావార్పు నిర్వహిస్తామన్నారు. నిండా గోతులమయమైన ఈ రహదారిలో ప్రయాణానికి ఏజెన్సీవాసులు నానా అవస్థలు పడుతున్నారని, దీనిపై అనేక మార్లు మొరపెట్టుకున్నా అధికారులు, నేతలు నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆందోళనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు..ఈ రహదారిపై ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్న వాహనదారులు ప్రయాణికులు,ప్రజా సంఘాలు, ఆదివాసీలు, గిరిజన సంఘాల నాయకులు,అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి నేతలు వజ్జు అప్పారావు, గుమ్మడి ప్రసాద్, సింగిరెడ్డి అచ్చారో కొంచెం జగన్నాధం, బీరబోయిన రామకృష్ణ, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెఎసి నేత బాలకృష్ణ

హౌసింగ్ ఎఇఇగా లక్ష్మీ విమల

ప్రజాశక్తి - జికె.వీధి : మండలంలోని దామనాపల్లి సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న పసుపులేటి లక్ష్మి విమలకు జికె.వీధి గృహ నిర్మాణ శాఖ ఎఇఇగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఎఇఇగా బాధ్యతలు స్వీకరించారు.నూతనంగా బాధ్యతలు తీసుకున్న లక్ష్మీవిమలను ఇన్‌ఛార్జ్ ఎఇఇ సెగ్గే సూరిబాబు, ఇతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉత్సవ నిర్వహణపై సన్నాహక సమావేశం

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు లో ఈనెల 22 నుంచి వచ్చేనెల 4 వరకు నిర్వహించే 36వ దేవీ నవరాత్రి ఉత్సవాలపై గురువారం సాయంత్రం ఉత్సవ నిర్వాహకులు కారే. శ్రీను అధ్యక్షతన గ్రామ పెద్దలు వివిధ సంఘాల నాయకులుతో శివాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్సవ నిర్వహణకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఈ నెల 13న దేవీ నవరాత్రుల ఉత్సవాలకు ముహూర్తపు రాట వేయడానికి నిర్ణయించారు. ఈనెల 22 నుంచి వచ్చే నెల 4 వరకు ఉత్సవాలు నిర్వహించడానికి తీర్మానం చేశారు. ఉత్సవ నిర్వహణ కమిటీకి గౌరవాధ్యక్షులుగా టి.బుట్టో, అధ్యక్షులుగా పందిరి కృష్ణ కోశాధికారులుగా శ్రీను, శివలను ఏకగ్రీవంగా నిర్ణయించారు. గత ఏడాది ఉత్సవ నిర్వహణ జమాఖర్చులను పెద్దల సమక్షంలో వెల్లడించారు. ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, కూటమి నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్ పురం: మండలంలోని రామవరం పంచాయతీలోని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను గురువారం స్థానిక సర్పంచ్ కారం బుచ్చమ్మ ఆధ్వర్యంలో సిపిఎం బృందం పంపిణీ చేశారు. స్మార్ట్‌కార్డుల్లో ఇబ్బందులుంటే తన దృష్టికి తేవాలని సర్పంచ్ సూచించారు.. కార్యక్రమలో సిపిఎం మండల నాయకులు కారం సుందరయ్య, నాయకులు విఆర్ఒ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం:మండలంలో కొత్తాడ గ్రామంలో సొసైటీ చైర్మన్ పాము అర్జున్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.మాజీ ఎంపిపి డాక్టర్ తీగల ప్రభసర్పంచ్ కలుముల అక్కమ్మ, జనసేన మండల అధ్యక్షులు కొమ్మన్న చెన్నారావు, బిజెపి జిల్లా కన్వీనర్ సత్యనారాయణ అమ్మ, సారపు పావని, రమేష్, బుల్లియమ్మ, పీసా ఉపాధ్యక్షులు పరిశిక శివరామకృష్ణ, సత్యవేణి, పిస సెక్రెటరీ చిన్ని బాబు, గ్రామ సెక్రెటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాము కాటు మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-చింతూరు : ఇటీవల పాముకాటుతో మృతి చెందిన చింతూరు మండలం వేగ పంచాయతీ వంక గూడెం గ్రామానికి చెందిన కన్నారావు కుటుంబానికి గురువారం ఆయుర్వేద వైద్యులు, జెకెసి ట్రస్ట్ చైర్మన్, టిడిపి మండల అధ్యక్షులు ఎండి జమాల్‌ఖాన్ రూ.మూడు వేలు ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఫుట్‌బాల్ కిట్‌కు రూ. పదివేలు సాయం

చింతూరులో ఫుట్‌బాల్ క్రీడాకిట్ కావాలని క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు జెకెసి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మహ్మద్ జమాల్‌ఖాన్ రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. క్రీడల్లో రాణిస్తూ ఉన్నతంగా ఎదగాలని, వ్యక్తిగతంగా పేరుప్రతిష్ఠలు తెచ్చుకోవడంతోపాటు గ్రామానికి, ఈ ప్రాంతానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షులు ఎండి జహంగీర్, నాయకులు అనిగి చంద్రయ్య, మార్కెట్ కమిటీ సభ్యులు పసుపులేటి సాల్మన్‌రాజు, షోడే రాఘవయ్య, చల్ల వెంకటేశ్వర్లు, విద్యార్థులు కుంజా శ్రీను, జి. శ్రీకాంత్, ఎం.వంశీ, జి. చరణ్, అర్జున్, సిహెచ్ ప్రవీణ్, శ్రీను పాల్గొన్నారు.

మొక్కలు నాటివేత

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం టేకు, కానుగ, వేప మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వి శంకరరావు మాట్లాడుతూ పచ్చని చెట్లు పెంచడం వలన పర్యావరణానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచినట్లయితే స్వచ్ఛమైన ఆక్సిజన్ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

245 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో బంగారు మెట పంచాయతీ కుజబంగి గ్రామ జంక్షన్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా 245 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్సా రాష్ట్ర సరిహద్దు ప్రాంతం లో గంజాయి కొనుగోలు చేసి ఆంధ్ర వస్తున్న ఆటో కొంత దూరంలో నిలిపి నలుగురుదిగి పారిపోతున్నారు. పోలీసులు నలుగురు వ్యక్తులను వెంబడించి అతి కష్టం మీద ఒకరిని పట్టుకుని స్థానిక ఎస్సై రామకృష్ణకు అప్పగించారు. పరారైన ముగ్గురు వ్యక్తుల వివరాలు తెలుసుకుని వారిని సైతం త్వరలోనే పట్టుకుంటామన్నారు. నిందితుడిని గురువారం కోర్టు ముందు హాజరు పరచగా రిమాండ్ కు తరలించారు.


నిందితుడితో పోలీసులు


నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

ఎపిటిఎఫ్ నేతల నిరసన

ప్రజాశక్తి- అనంతగిరి:ఉపాధ్యాయులు దీర్ఘాకా లికంగా నెలకొన్న సమస్యలు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపిటిఎఫ్ నేతలు నల్ల రిబ్బన్లతో నిరసన నిర్వహించారు. మండల ఏపీటీఎఫ్ యూనియన్ అధ్యక్షులు డి. సన్యాసిరావు ఆధ్వర్యంలో గురువారం టోకూరు బాలికల పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో సందర్శించి నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు సనాసి రావు, మంజునాథ్‌లు మాట్లాడుతూ,ఉపాధ్యాయులు దీర్ఘకాలికంగా ఏళ్ళు తరబడి అనేక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పెండింగ్ లో ఉన్న డీఏలతో పాటు, పిఆర్సి, ఐఆర్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు


వినతిపత్రాన్ని ఇస్తున్న ఉద్యోగులు

సమస్యలపై ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి-చింతపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలన కోరుతూ సచివాలయ ఉద్యోగులు గురువారం ఎంపిడిఒ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఎంపిడిఒగా కొత్తగా బాధ్యతలు స్వీకరించన ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. తమకు బకాయిలు, ప్రమోషన్లు, సర్వేలు లేకుండా చేసే పనులపై ఉన్న ఇబ్బందులను అధికారుల దృష్టిక తీసుకెళ్లి పరిష్కరించాలన కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శి నవ మోహన్, కోశాధికారి సత్యనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

దోమల స్వైరవిహారం

ప్రజాశక్తి- విఆర్ పురం: వర్షాలు, వరదలు తగ్గుముఖం పట్టి, ఎక్కడికక్కడే బురద, మురుగునీటి కుంటలుగా మారడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయనిస్థానికులు ఆవేదన చెందుతున్నారు. అపారిశుధ్యంతో రహదారులు రొచ్చుగా మారాయని, దుర్గంధం వెదజల్లుతూ, దోమలు, వాటి లార్వాలకు ఆవాసంగా మారిపోయాయని ఆవేదన చెందతున్నారు. ప్రధాన వీధులతోపాటు అంతర్గత రోడ్లలోనూ అపారిశుధ్యం తాండవించి, దోమలు విజృంభిస్తుండడంతో వ్యాధులు ప్రబలుతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. అన్ని వరద ప్రభావిత గ్రామాల్లో తక్షణ మూడవ విడత దోమలు నిర్మూలనకు మందు పిచికారి చేయాలని పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జిసిసి హమాలీలకు ఉద్యోగభద్రత కల్పించాలి

ప్రజాశక్తి -రంపచోడవరం : ఏజెన్సీ ప్రాంతంలో జిసిసిలో పనిచేస్తున్న హమాలీలు, వర్కర్స్‌ను ఉద్యోగులుగా ప్రకటించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియుసి నాయకులు జత్తుక కుమార్ డిమాండ్ చేశారు. రంపచోడవరంలో జిసిసి హమాలీల యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో కుమార్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న హమాలీలకు ఇచ్చే అరకొర వేతనాలు వారి కుటుంబపోషణకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు చెల్లించాలని, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్.జిల్లా ప్రధాన కార్యదర్శి పండు బాబు మాట్లాడుతూ . జిసిసి హమాలీలు, ఇతర కార్మికుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులోకార్యచరణ రూపొందించి, ఉద్యమిస్తామని హెచ్చరించారు సిపిఐ నేత గోమదుర్గ సుబ్బారావు, యూనియన్ నాయకులు అప్పారావు రాజబాబు స్వామి కార్మికులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో ఏకలవ్య విద్యార్థి ప్రతిభ



బహుమతి స్వీకరిస్తున్న హరిప్రసాద్

ప్రజాశక్తి- జికె.వీధి: గూడెం కొత్తవీధి ఏకలవ్య పాఠశాల పదో తరగతి విద్యార్థి కంకిపాడు హరిప్రసాద్ గుంటూరులో జరిగిన అండర్ -19 ఏకలవ్య పాఠశాలల రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచాడు. మండలంలోని లక్కవరపుపేట గ్రామానికి చెందిన కంకిపాటి హరిప్రసాద్ చదువుతోపాటు క్రీడలపై ఆసక్తితో ఉండడంతో పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహంతో టేబుల్ టెన్నిస్ ఇష్టపడి నేర్చుకున్నాడు గుంటూరులో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో పాఠశాల తరపున ప్రాతినిధ్యం వహించి విజేతగా నిలిచాడు. మండలానికి, గ్రామానికి, ఏకలవ్య పాఠశాలకు,కీర్తి ప్రతిష్టలను తెచ్చిపెట్టాడని హరి ప్రసాద్‌ను పాఠశాల యాజమాన్యంతో పాటు స్థానికులు ప్రశంసలు కురిపించారు. హరిప్రసాద్ చదువుతోపాటు క్రీడల్లోనూ అత్యుత్తమంగా రాణించి ఉన్నత స్థానానికి ఎదగాలని, ఇంకెన్నో గొప్ప విజయాలు సాధించాలని ఏకలవ్య ప్రిన్సిపాల్ ఎంవి రమణారావు ఆకాంక్షించి, ఆశీర్వదించారు. కుమారుడి ప్రతిభపై హరిప్రసాద్ తల్లిదండ్రులు కంకిపాటి బుజ్జి పడాల్,పాపి దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.